## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉస్మానియా ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..ఉస్మానియా ఆసుపత్రిలో 8 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలుగా, పేషంట్ కేర్‌లో పనిచేస్తున్న కార్మికులను అకారణంగా శానిటేషన్ కార్మికులుగా పనిచేయాలని కోరుతున్నారని దీంతో వారు మానసిక వేదనకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రస్తుతం వారు పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ విధానంలోనే వారిని కొనసాగించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర నాయకులు నర్సిరెడ్డి, కృష్ణ, వినోద్, సంగీత, సాయిలత, రేవతి, షరాఫత్ అలీ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఇంట్లో కళాఖండం ఉండాలి



ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

గోల్కొండ: కళాఖండాలు కళాకారుల అద్భుత పనితనానికి నిదర్శనమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ అనేది అందరికి సంబంధించిన విషయం అని అన్నారు. కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చే ఇటువంటి ఆర్ట్ ఫెస్టివల్స్ సంవత్సరం పొడవున కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ కలెక్టర్ పార్వతిరెడ్డి, నార్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కె.లక్ష్మాగౌడ్, అంజు పోదర్, రాజేంద్రపాటిల్, ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు ఉంటుందని 30 గ్యాలరీలు, 250 మంది కళాకారుల 3500 కళాఖండాలు, వంద స్టాల్స్ ఉన్నాయి. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు టికెట్ తీసుకోని ప్రవేశం పొందవచ్చు.

## అన్నదానం.. మహాదానం


ఆహార పదార్థాలు అందజేస్తున్న డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి, శివకుమార్ తదితరులు

చార్మినార్: చేప ప్రసాదాన్ని తీసుకోవడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అధికంగా నగరానికి చేరుకుంటున్న వారి సౌకర్యార్థం టీఎస్ బసవ కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా ఆహార పదార్థాలను అందజేయడం అభినందనీయమని మెదక్ జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ మర్కాపురం శివకుమార్ కొనియాడారు. శుక్రవారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలో టీ, టిఫిన్‌లతో పాటు భోజనాలను ఉచితంగా అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఒకటి, రెండు రోజుల ముందుగా నగరానికి చేరుకుంటున్న ప్రజలకు ఇలాంటి కార్యక్రమాలు మేలు చేస్తాయంటున్నాయి. డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి మాట్లాడుతూ.. తాము ఏళ్ల తరబడి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా తమ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముందు బసవేశ్వరుని చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునప్ప, ప్రభాకర్, నటరాజ్, శివ శరణప్ప సీరే, మహంతప్ప కులకర్ణి, రాజేశ్ మాశెట్టి, బీం భాయ్, శివ,అశోక్ మాశెట్టి, ప్రశాంత్, బసంత్ రావు పాటిల్ పాల్గొన్నారు.

## కార్యకర్తల సమష్టి కృషితోనే మజ్లిస్ విజయం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మిర్జా ఎక్బాల్ అహ్మద్

గోల్కొండ: కార్యకర్తల సమష్టి కృషితోనే మజ్లిస్ విజయం సాధించిందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్లకు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు ఆయనను కలిశారు. నియోజకవర్గంలో గత పార్లమెంటు ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీకి అత్యధిక మెజార్టీ వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్‌కు కులమతాల అడ్డుగోడలు లేవని మజ్లిస్ పార్టీ సెక్యూలర్ పార్టీ అన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసు అని ఆయన అన్నారు. ప్రముఖ నాయవాది, మజ్లిస్ నాయకుడు మిర్జా ఎక్బాల్ అహ్మద్, ఏఆర్ బిల్డర్స్ అధినేత అజీమ్, అరూన్‌ఫరాన్, జుబేర్‌బిన్ అవద్, అబీబ్ చౌస్ తదితరులున్నారు.

**షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..**

ఎన్నికల కోడ్ ముగిసిందని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ వారి దరఖాస్తులు మంజూరవుతాయని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. శుక్రవారం ఆయన హకీంపేట్‌లోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులున్నారు.

## లంగర్‌హౌస్ రాంలీలా మైదానాన్ని కాపాడాలి


పర్యాటకశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాహుల్‌దాస్‌బాబా

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ రాంలీలా మైదానాన్ని కాపాడాలని శ్రీరాంచంద్రజీ మఠం పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా పర్యాటక శాఖ కమిషనర్‌ను కోరారు. త్రివేణి సంగం వద్ద నెలకొన్న పరిస్థితులు సద్దుమణిగేలా చేసి రాంలీలా మైదానాన్ని యధావిధిగా కొనసాగించాలంటూ రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో శుక్రవారం పర్యాటక శాఖ కమిషనర్ రమేష్‌నాయుడును కలిసి సమస్యను వివరించారు. ఆయన వెంట నాయకులు ఇంద్రసేనా రెడ్డి, చంద్రశేఖర్‌లు ఉన్నారు.

**మహిళా అధికారిణి అత్యుత్సాహం..**

సంగం వద్ద పరిస్థితులు ఇలా ఉండగా పర్యాటక శాఖ అధికారిణి మాత్రంపై అధికారుల మాటలు పట్టకుండా బాబాపై కేసు నమోదు చేయాలని రోజూ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగడంపై నాయకులు మండిపడుతున్నారు. ఆమెతో పాటు మరో అధికారి మూడు రోజుల క్రితం వచ్చి తమకు నెల రోజులు గడువు ఇచ్చి భూమికి సంబంధించిన పత్రాలు సమర్పించాలని చెప్పారన్నారు. తమను సమయం ఇచ్చిన ఆమెనే బాబాపై కేసు అంటూ ఎందుకు అత్యుత్సాహం చూపుతున్నారో చెప్పాలన్నారు. శుక్రవారం సాయంత్రం కూడా లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో గంట పాటు కూర్చున్న ఆమెపై నాయకులు మండిపడ్డారు. ఈ విషయమై పర్యాటక కమిషనర్‌కు తెలపగా ఆయన చెప్పడంతో ఆమె అక్కడి నుండి వెళ్లిపోయారు.

## ఫార్మాసిస్ట్‌ల సమస్యలు పరిష్కరించాలి



డీహెచ్ రవీంద్రనాయక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సంఘం రాష్ట్ర కార్యవర్గం

సుల్తాన్‌బజార్: పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే కల్పించాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ కోరారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో కోఠిలోని డీహెచ్ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ బి.రవీంద్రనాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ వల్ల పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే కల్పించాలని ఆయన కోరారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. 24, 18, 12 సంవత్సరాల స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, 104, ఆర్‌బీఎస్‌కే, యూపీహెచ్‌సీ, ఆయూష్, తదితర ఏజెన్సీలలో పనిచేస్తున్న ఫార్మసిస్టులకు ఎన్నో సమస్యలు ఉన్నాయని వీటిపై దృష్టి సారించాలని కోరారు. దీనికి డీహెచ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి అహ్మద్‌ఉల్లాఖాన్, రామకృష్ణ, ప్రకాష్‌రావు, ప్రేమ్ సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, జయప్రకాష్ పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మీలా జయదేవ్, ఎస్.వి.ఎన్.విజయేంద్ర

నాంపల్లి: వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువను సృష్టించడం ద్వారా మన ఆర్థిక వ్యవస్థలో ఆహార ప్రాసెసింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు అన్నారు. గురువారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఎఫ్‌టీసీసీఐ, సీఎఫ్‌టీఆర్ఐ సంస్థల సంయుక్తాధ్వర్యంలో 'ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలు'అనే అంశంపై వర్క్‌షాపు జరిగింది. ఈ సదస్సును ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మీలా జయదేవ్, సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.వి.ఎన్.విజయేంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.వి.ఎన్.విజయేంద్ర మాట్లాడుతూ..ఆహార సాంకేతికత, సంరక్షణలో సీఎఫ్‌టీఆర్ఐ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు తొలి అడుగు వేసేందుకు భావి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించడం జరిగిందని తెలిపారు. సీఎఫ్‌టీఆర్ఐ అందించే సేవలు, మద్దతులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, సంరక్షణ, సూక్ష్మ నైపుణ్యాలను అర్థం చేసుకోవడంలో వర్క్‌షాపు సమాయపడుతుందని చెప్పారు. మీలా జయదేవ్ మాట్లాడుతూ.. వ్యవసాయం, పరిశ్రమలు పరస్పరం ఆధారపడి ఉంటాయని, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు ఆర్థికావృద్ధికి కీలకమన్నారు. భారతదేశం ఆహార కొరత నుంచి ఆహారం మిగులు దేశంగా మారడంతో ఈ రంగంలో అవకాశాలు గణనీయంగా విస్తరించాయన్నారు. అయితే రైతుల వద్ద ప్రాథమిక ప్రాసెసింగ్ సౌకర్యాలు కూడా లేకపోవడం వల్ల 40 శాతం వ్యవసాయ ఉత్పత్తులు వృథా అవుతున్నాయని అంచనా ఉందన్నారు. సీఎఫ్‌టీఆర్ఐ సరసమైన ఖర్చుతో ప్రాసెసింగ్ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ కె.సత్యమాల, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.శ్రీధర్, ఎ.నాగేందర్, కె.శ్రీనివాసులు, ఎఫ్‌టీసీసీఐ ఫుడ్ ప్రాసెసింగ్ కమిటీ చైర్మన్ చంద్ర మోహన్ పాల్గొన్నారు.

## సన్మానం



గోల్కొండ: తెలంగాణ శాసన సభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను జియాగూడ మాజీ కార్పొరేటర్, కార్వాన్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మిత్ర కృష్ణ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్పీకర్‌కు పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. కష్టపడి పని చేసే వారికే ప్రజల నుంచి గుర్తింపుతో పాటు మెప్పు కూడా లభిస్తుందని అన్నారు.

## పరామర్శ


చంద్రకళారెడ్డి కుటుంబసభ్యులతో బండారు దత్తాత్రేయ

గోల్కొండ: బీజేపీ నాయకులు, కార్యకర్తలకు వారి కుటుంబాలకు పార్టీ అధిష్టానం ఎప్పుడూ అండగా నిలుస్తుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బీజేపీ సీనియర్ నాయకురాలు చంద్రకళారెడ్డి భర్త రవీందర్‌రెడ్డి గత వారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం సాయంత్రం గుడిమల్కాపూర్ సత్యనారాయణనగర్ కాలనీలోని చంద్రకళారెడ్డి ఇంటికి వచ్చి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాం పంపిణీ



యాకుత్‌పురా: ఈ ఏడాది నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అన్ని ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ చార్మినార్ మండల డిప్యూటీ ఈఓ ఐ.నెహ్రూ బాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పలు పాఠశాలలకు విద్యార్థుల స్కూల్ యూనిఫాంను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ ఏడాది నూతన విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమాలు పెద్ద ఎత్తున్న నిర్వహించి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మండల పరిధిలోని 46 ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశామన్నారు.

## ఆలయ విస్తరణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

యాకుత్‌పురా: హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయం అభివృద్ధి విస్తరణకు ప్రభుత్వం తరపున చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఆలయం ప్రాంగణం చిన్నగా ఉన్నందున్న పక్కనే ఉన్న ప్రైవేట్ స్థలాని ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి కొనుగోలు చేసి ఆలయాని విస్తరించి మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంత్రిని కలసిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ పర్షాద్, కోశాధికారి సతీష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పీ క్రాంతికుమార్, కార్యవర్గ సభ్యులు కన్నయ్య లాల్, దినేష్ ఉన్నారు.

## నిలోఫర్ ఆసుపత్రిలో ఆధార్ సెంటర్ ప్రారంభం



నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఖైరతాబాద్ డిప్యూటీ పోస్ట్ మాస్టర్ వైఎస్సార్ శ్రీనివాసులుతో కలిసి నిలోఫర్ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ కె.జ్యోతి ప్రారంభించారు. వైద్య సంరక్షణ, చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆసుపత్రికి వచ్చే వ్యక్తుల సౌకర్యార్థం ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. అన్ని రకాల ఆధార్ సేవలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినియోగించుకోవాలని కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని వివిధ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పాల జ్యోతిరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పారిశ్రామిక శిక్షణ సంస్థలోని ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, డిజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్, మోటార్ మెకానిక్, కార్పెంటర్, తదితర ట్రేడ్‌లలో శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు విజయనగర్‌కాలనీలో ఉన్న మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించవచ్చు.

## పదవి ఇవ్వాలని కోరుతూ వినతి



చార్మినార్: ఎన్నో ఆశలు, ఆశయాలతో దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధికి నిరంతరం సేవ చేస్తున్న తనకు ఈసారి తప్పని సరిగా గుర్తింపునిస్తూ స్థానిక సంస్థలలో ప్రాధాన్యత కల్పించాలని టీపీసీసీ కార్యదర్శి కె.ఎస్.ఆనంద్‌రావు పార్టీ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీకి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఏళ్ల తరబడి పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశామని.. పాతబస్తీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్న తనకు ఎమ్మెల్సీ లేదా స్థానిక సంస్థలలో చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో 'ఆయతే తరీమా'

గోల్కొండ: తెలంగాణతో పాటు దేశం సుభిక్షంగా ఉండాలంటూ తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో కూడిన ఆయతే తరీమా నిర్వహించారు. టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు లాభపడాలని ఈ సందర్భంగా ప్రార్థనలు చేశామని ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. అదే విధంగా అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజార్టీతో ఎంపికైన సందర్భంగా ఈ ప్రార్థనలు నిర్వహించామన్నారు. ఈ ప్రార్థనలకు మౌలానా మహ్మద్ సాహెబ్ నేతృత్వం వహించారు. ఖాలేద్ ఆలీఖాన్, ఆర్గనైజేషన్ కార్యాలయ ఇన్‌చార్జి ఫహాద్, షాహేద్ తదితరులున్నారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయాలి


ఎస్.ఎం.హుస్సేన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కె.ఆర్.రాజ్‌కుమార్

నాంపల్లి: జీ.ఓ నెం-317పై ఉత్పన్నం అవుతున్న సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా విద్యా శాఖలో పనిచేసే పలువురు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్స్ కోరారు. శుక్రవారం డీఈఓ యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్ నేతృత్వంలో విద్యాశాఖలో పనిచేసే ఉద్యోగులు టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం.హుస్సేన్‌ను కలిసి సమస్యలను వివరించారు. 1975లో వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. కేంద్ర సంఘం అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్.ఎం.హుస్సేన్ హామీ ఇచ్చినట్లు కె.ఆర్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు ముఖీద్, డీఈఓ యూనిట్ ఉపాధ్యక్షులు బి.రవి, ఎ.రుగేష్, సంయుక్త కార్యదర్శి జయంతి, కార్యవర్గ సభ్యులు ప్రియదేవ్ ఠాకూర్, ముజాహిద్ అలీ, సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.

## ఆస్తమా రోగులకు తాగునీరు, అల్పాహారం పంపిణీ


మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమైన ఆస్తమా రోగులకు సేవలందించే బద్రి విశాల్ తదితరులు


వాటర్‌బోర్డు జీఎం జాన్ షరీఫ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన తాగునీటి సరఫరా కేంద్రం


అల్పాహారాలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆస్తమా రోగులకు శుక్రవారం పలు సేవలందించారు. శనివారం ఉదయం బత్తిని సోదరులు చేపప్రసాదం పంపిణీ చేయనున్న దృశ్య పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఆస్తమా రోగులకు వాటర్ బోర్డు జీఎం జాన్ షరీఫ్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా పలు స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం పంపిణీ చేశాయి.

## ఘనంగా శనీశ్వరుడి జయంతి


పూజలు చేస్తున్న ఆలయ ప్రతినిధి వినయ్ దేశ్ పాండే

జియాగూడ: జియాగూడలోని కేసరి హనుమాన్ ఆలయంలో శనీశ్వరుడి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతినిధి వినయఖ్ దేశ్‌పాండే ఆధ్వర్యంలో శనేశ్వరుడి విగ్రహానికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజా కార్యక్రమాలు నిర్వహించి అఖండ హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నితిన్‌సాయి, సురేష్ గురున్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అభినందనలు


దీపాదాస్ మున్షీని కలిసిన వెంకటేశ్

గౌలిపురా: ఏఐసీసీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, నూతన కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీ గణేష్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ శుక్రవారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ వారికి అభినందనలు తెలిపారు. దీపదాస్ మున్షీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గతంలో కంటే ఎక్కువ ఎంపీ సీట్లను గెలుచుకోవడం పట్ల వెంకటేశ్ ఆమెకు అభినందనలు తెలిపారు. అదే విధంగా సికింద్రాబాద్ కంటోన్మెట్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన గణేష్‌ను వెంకటేశ్ అభినందించారు.

## బండ్లగూడ డిప్యూటీ ఐవోఎస్-2గా దశరథ్


దశరథ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండల డిప్యూటీ ఐవోస్-2గా దశరథ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన జైనాబ్ సుల్తానా నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.గిరివర్ధన్, టీఎస్‌టీయూ నగర అధ్యక్షుడు మహ్మద్ అహ్మద్ ఖాన్, ఎంటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మోయిన్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయ్ భాస్కర్, జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నర్సింహా, నాయకులు మతీన్, అసద్ అలీ, అరుణ, నరేష్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

## ఓటర్ల జాబితా పరిశీలన


ఓటరు జాబితా వివరాలను అడుగుతున్న బల్దియా అధికారి నరేంద్ర

గోల్కొండ: అధికారుల ఆదేశాల మేరకు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకుంటున్నామని బల్దియా అధికారులు నరేంద్ర, ఖదీర్ తెలిపారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో 17 వేల ఓట్లు తొలగించబడ్డాయని, ఒక్క షేక్‌పేట్ డివిజన్ నుంచే నాలుగు వేల ఓట్లు గల్లంతయ్యాయని దీనిపై విచారణ చేయాలని జూబ్లిహిల్స్ కాలనీస్ ఫోరం అధ్యక్షుడు ఆసీఫ్‌హుస్సేన్ సోహేల్ బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన బల్దియా కమిషనర్ ఈ విచారణ కోసం షేక్‌పేట్ డివిజన్‌లో అధికారులను పంపి ఓటరు జాబితాలోని పేర్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా నరేంద్ర ఆధ్వర్యంలో అధికారులు టోలిచౌకీ పరిసర కాలనీలలో ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాలో పేర్ల వివరాలను అడిగి సేకరించారు.

## హైకోర్టు అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పోస్టును మాదిగలకు కేటాయించాలి


బషీర్‌బాగ్‌లోని బీజేఆర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నవీన్‌రాజ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా హైకోర్టులోని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పోస్టును మాదిగలకు కేటాయించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.నవీన్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు బి.ఉపేందర్, యువసేనా నగర అధ్యక్షులు జయరామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ తేజ, రంజిత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లు రవికి సన్మానం


మల్లు రవిని సత్కరిస్తున్న పోల్కం వినయ్‌రాజ్

అబిడ్స్: కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించిన డాక్టర్ మల్లు రవిని రాష్ట్ర మేరు యువజన సంఘం నాయకుడు పోల్కం వినయ్ రాజ్, ఆదిమూలం శంకర్‌తో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్షలాది మంది మేరు కులస్తులు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఎంపీ మల్లు రవికి మెమోరాండం అందజేశారు. తెలంగాణ ఉద్యమ యోధుడు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 33 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడుగా మెలుగుతూ పోల్కం శ్రీనివాస్ పార్టీ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. పోల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవి ఇచ్చి మేరు కులస్తులకు అండగా నిలవాలన్నారు.

## 'దేశంలో బీజేపీకి తిరుగులేదు'

గోల్కొండ: దేశంలో బీజేపీకి తిరుగులేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కంది మోహన్‌రెడ్డి అన్నారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రజలు బీజేపీ పాలన, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఉండాలని కోరుతున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు దీటుగా బీజేపీ నిలిచిందని తెలంగాణ పార్లమెంటు ఎన్నికలు బీఆర్ఎస్‌ను కనుమరుగు చేశాయన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఇద్దరే మిగిలిపోతారని ఆయన పేర్కొన్నారు.